

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-హుకుంపేట:మండలం లోని చీకు మద్దుల పంచాయితీ ముసిరిపాడు గ్రామానికి రోడ్డు పనులను వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు శుక్రవారం ప్రారంభించారు.అనంతరం మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, ముసిరిపాడు గ్రామానికి మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరుతోరహదారి కష్టాలు తీరనున్నాయన్నారు. నడిచి వెళ్లే పాదచారులకు ఎక్కువ ఉపయోగ కరంగా ఉంటుందని వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చీకుమద్దుల, గన్నేరుపుట్టు సర్పంచ్‌లు బొంజన్న దొర, కృష్ణారావు, వార్డు మెంబర్ మజ్జి రాజారావు, వలసనైని వంశీ, సురేష్ నాయుడు, నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు మజ్జి వెంకట రమణ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపిపి

ఆదివాసీలకు ఉద్యోగాలు కేటాయిస్తూ..

నోటిఫికేషన్ విడుదల చేయాలి

- మహిళ సెక్యూరిటీ గార్డులను కొనసాగించాలి

-జిల్లా కలెక్టర్‌కు ఆదివాసీ గిరిజన సంఘం వినతి

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా లో మహిళ, శిశు సంక్షేమ శాఖలో మిషన్ వాత్సల్య కింద మంజూరైన పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, ఈ ఉద్యోగాలల్లో ఎస్టీలకు ఒక్క పోస్ట్ కూడా కేటాయించక పోవడం అన్యాయమని ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. నూతనంగా ఏర్పడిన ఆదివాసీ జిల్లా లో మహిళ, శిశు సంక్షేమ శాఖ మిషన్ వాత్సల్య కింద మంజూరైన పోస్టుల భర్తీ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు కలెక్టర్కు వివరించారు. స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగాల కల్పనకు రీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. అల్లూరి జిల్లా పాడేరు 11 మండలాల్లోని గురుకులం, ఏకలవ్య స్కూళ్లలో సుమారు 60 మంది మహిళా సెక్యూరిటీ గార్డులు గత సంవత్సరాల పాటు పని చేస్తున్నారని, వారిని తొలగించి వేరే వారిని నియమకం చేపడుతున్నారని కలెక్టర్కు వివరించారు. అరకొర జీతంతో గత 2 సంవత్సరాల నుంచి పని చేస్తున్న వారిని కాదని, కొత్త వారితో నియమాకం చేపట్టడం సమంజసం కాదన్నారు. రెండేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న మహిళా సెక్యూరిటీ గార్డులను కొనసాగిస్తూ రెన్యువల్ ఆర్డరు ఇవ్వాలని కోరారు

ఐ.సి.డి.ఎస్ నోటిఫికేషన్ రద్దు చేస్తామని, స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగం కోసం రోస్టర్ పాయింట్లు ఆధారంగా ఉద్యోగం ఇస్తామని వేరే నోటిఫికేషన్ విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడించారు. ఆదివాసీ మహిళ సెక్యూరిటీ గార్డులను తిరిగి నియామకం కోసం రాష్ట్ర అధికార్లతో సంప్రదిస్తామన్నారు. టెండర్లలో అక్రమాలకు పాల్పడ్డ వారిపై చర్యలకు కూడా అధికార్లకు సిఫార్స్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాల్ దేవ్, మహిళ సెక్యూరిటీ గార్డులు సీతమ్మ, మమత, ప్రశాంతి, నిర్మల, మంగ, నాగమణి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు అప్పలనర్స, బాలదేవ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శ్యామల రాధ

చింతూరు సిఐగా గజేంద్ర కుమార్

నియామకాన్ని నిలిపివేయాలి

-హత్యకు గురైన స్వప్న తల్లి రాధ

ప్రజాశక్తి - చింతూరు

చింతూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర కుమార్ నియామకాన్ని నిలిపివేయాలని 2019లో హత్యకు గురైన శ్యామల స్వప్న తల్లి శ్యామల రాధ అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని మామిళ్ళ గూడెం గ్రామంలో 2019 సంవత్సరంలో తన కుమార్తె శ్యామల స్వప్న (15) హత్యకు గురైందని తెలిపారు. ఈ సంఘటనపై గతంలో చింతూరులో సిఐగా పని చేసిన గజేంద్ర కుమార్‌కు ఫిర్యాదు చేసినా ఆయన కేసు నమోదు చేయకుండా ముద్దాయిలకు సహకరించారని ఆరోపించారు. ముద్దాయిలు బెయిల్‌పై వచ్చి బెదిరింపులకు పాల్పడ్డారని, ఇదంతా సిఐ గజేంద్ర కుమార్ సహకారంతోనే చేశారని విమర్శించారు. వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళనా కార్యక్రమాలతో సిఐ గజేంద్రతో పాటు, నాటి ఎస్ఐను అధికారులు సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. చింతూరు డివిజన్‌లోని ఎటపాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా గజేంద్ర రావడంతో స్థానికులు బిక్కు బిక్కుమంటు బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమార్తె హత్య కేసు కోర్టులో నడుస్తుండగా, చింతూరు పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జగేంద్రను తిరిగి నియమించడం సరికాదన్నారు. తన కుమార్తె హత్య కేసు కోర్టులో నడుస్తుంగా, మళ్లీ సిఐగా గజేంద్ర కుమార్‌ను నియమించడం వల్ల ఆ కేసుపై ప్రభావం ఉంటుందని తెలిపారు. అందువల్ల చింతూరు సిఐగా జగేంద్రకుమార్ నియమాకాన్ని వెంటనే నిలుపుదల చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాకు, ఎస్‌సి, ఎస్‌టి, హెచ్‌ఆర్‌సిలకు కూడా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసినట్టు చేసినట్లు రాధ వెల్లడించారు.

తుపాను పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్




ప్రజాశక్తి-పాడేరు: రానున్న రెండు మూడు రోజులలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట చేతికొచ్చి కల్లాలలో ఉన్న వరి పనలు సురక్షిత ప్రదేశాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ రైతులకు విజ్ఞప్తి చేసారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం వాయుగుండంగా, తీవ్ర వాయుగుండంగా మారి తుఫానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ రైతులను అప్రమత్తం చేసారు. అదేవిధంగా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. గిరిజనులు గెడ్డలు, వాగులు దాటి ప్రయాణిచవలసిన సందర్భంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా, మండల స్థాయి అధికార యంత్రాంగం స్థానికంగా అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాయుగుండం సోమవారం సాయంత్రానికి చెన్నై-మచిలీపట్టణం మధ్య తీరం దాటే అవకాశం ఉందని, దీని ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు, కొన్ని ప్రాంతాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించి నట్లు వెల్లడించారు.

తాపీమేస్త్రీలకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-హుకుంపేట:మండల కేంద్రంలోని సంత బయలు వద్ద తాపీమేస్త్రీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అనంతరం గిరిజన మహిళ సంఘం జిల్లా నేత హైమావతి మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులైన తాపీ మెస్త్రీల సంక్షేమం కోసం ప్రభుత్వం లేబర్ బోర్డు ద్వారా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో లేబర్ బోర్డు ద్వారా తాపీమేస్త్రీలు, భవన నిర్మణ కార్మికుల సంక్షేమం కోసం నిధులు ఇచ్చే వారని, ఆ నిధులను వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని ఆరోపించారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, ప్రమాదం జరిగితే 5 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాన్నారు. మరణిస్తే 20 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక ఇల్లు, పెన్షన్ స్కీమ్ అమలు చేసి,కార్మికుల పిల్లల విద్య కోసం స్కాలర్ షిప్, పెళ్లి ఖర్చులు తదితర వాటిని మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు, తడిగిరి వైస్ సర్పంచ్ కిల్లో రామారావు, భవన నిర్మణ కార్మికులు ప్రెసిడెంట్ శిద్దేస్, వైస్ ప్రెసిడెంట్ మురళి, రాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హైమావతి



దట్టంగా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో మలుపు వద్ద రహదారి కనిపించని దృశ్యం

రోడ్డుకిరువైపులా తుప్పలు తొలగించరూ...

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి జంక్షన్ నుండి ప్రముఖ పర్యాటక ప్రాంతమైన పోచవరం గ్రామానికి వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, తుప్పలు ఏపుగా పెరిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పాపికొండలకు వెళ్లే పర్యాటకులు, పరిసర గ్రామాల ప్రజలు ఈ రహదారిలో నిత్యం ప్రయాణిస్తూ ఉంటారు. ఈ రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోవడంతో మూల మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరో వైపు ఈ రహదారిలో పలు చోట్ల పెద్ద గోతులు ఉన్నా రోడ్డు మరమ్మతులు చేయలేదు. నేషనల్ పార్క్ పేరుతో వచ్చి పోయే వాహనాల నుండి అటవీశాఖ అధికారులు వివిధ రూపాల్లో పన్నులు వసూలు చేస్తున్నారు. అలాగే పాపికొండలకు వెళ్లే టూరిస్టుల నుండి పర్యాటక శాఖ రుసుములు వసూలు చేస్తుంది. ఈ రహదారి నుండి ఆదాయం పొందుతున్న ఆ శాఖలు, ప్రభుత్వం కూడా ఈ రహదారి గురించి పట్టించుకోవడంపై పర్యాటకులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్ అండ్ బి శాఖ అధికారులు స్పందించి రేఖపల్లి జంక్షన్ నుండి పోచవరం గ్రామానికి వెళ్లే రోడ్డును బాగు చేయాలని వాహనదారులు, పర్యాటకులు, కొండరెడ్ల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-విఆర్.పురం

కార్తీక మాసం సందర్భంగా మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. వడ్డిగూడెం గ్రామంలోని శ్రీరుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు ఎం.లక్ష్మీనరసింహ శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దీపారాధన చేశారు. మహిళలు భారీగా తరలి వెళ్లి శబరి గోదావరి సంగమ తీరంలో పుణ్య స్థానాలు ఆచరించి శ్రీరుద్ర కోటేశ్వరస్వామికి అక్కడే ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష పూజలను నిర్వహించారు.

బదిలీ అయిన పోలీసులకు సన్మానం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్‌లో పని చేసి బదిలీ అయిన హెడ్ కానిస్టేబుల్ శ్యామ్, కానిస్టేబుల్ సత్య, ప్రసాద్, పడాల్‌లను శుక్రవారం ఘనంగా సత్కరించారు. జీకే వీధి సిఐ అశోక్ కుమార్, సీలేరు ఎస్సై రామకృష్ణ, సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ డిఎస్పి సురేష్ తదితరులు బదిలీ అయిన పోలీసులను దుస్సాలువాలతో ఘనంగా సన్మానించి, చిరు జ్ఞాపికలను అందజేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ ఎటువంటి రిమార్క్ లేకుండా పోలీస్ శాఖలో పనిచేశారని కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందే ఇదే ఒరవడిని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుందరం, సివిల్, సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.



వీడ్కోలు పలుకుతున్న సీఐ అశోక్ కుమార్ ఎస్సై రామకృష్ణ డిఎస్పీ సురేష్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

- పాడేరు శాసనసభ్యులు భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-పాడేరు:యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 15వ తేదీ నుంచి ఫిబ్రవరి మూడో తేదీ వరకు దాదాపు 50 రోజుల పాటు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఆడుదాం ఆంధ్రా పోటీలు జరుగుతాయని చెప్పారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడలకుగాను ప్రతి సచివాలయం వారిగా ఆడదాం ఆంధ్రాకు రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. ఇప్పటి వరకు పాడేరులో 508 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆమె వెల్లడించారు. 15 సంవత్సరాలు దాటిన వారంతా ఆడుదాం ఆంధ్రా కు అర్హులేనని పేర్కొన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక సంతోషాన్నిస్తాయని తెలిపారు. హుకుంపేటకు చెందిన రవళి అంధుల క్రికెట్ విభాగంలో జాతీయస్థాయిలో ప్రతిభ కన బరచడం గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో ట్రై కార్ చైర్మన్ శతక బుల్లిబాబు, ఎంపీపీ సొన్నారి రత్నకుమారి, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, జిల్లా వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్న దొర, మండల పార్టీ అధ్యక్షులు సీదరి రాంబాబు, పార్టీ మండల ఉపాధ్యక్షులు పసుపుల సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు వనుగు బసవన్న దొర, జిల్లా పంచాయతీరాజ్ కమిటీ అధ్యక్షులు గబ్బాడి చిట్టిబాబు పాల్గొన్నారు.

మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి- చింతపల్లి: మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. చింతపల్లి పశు వైద్యశాలలో శిక్షణ పొందిన 18 మంది విద్యార్థులకు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సర్టిపికెట్లను పంపిణీ చేశారు. మూడు మండలాల వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం మూగ జీవాలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించాలనే అంబులెన్స్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సచివాలయంలో ఆ శాఖకు సంబంధించిన సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. పశు వైద్యులు కూడా సకాలంలో స్పందించి మూగ జీవాలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారన్నారు.శిక్షణ తీసుకున్న ప్రతీ విద్యార్థి చిత్తశుద్ధితో మూగ జీవాలకు విశేష సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, చింతపల్లి, జి కే. వీది, కొయ్యూరు మండలాలకు చెందిన పశు వైద్యులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను అందజేస్తున్న సర్పంచ్

ప్రజా ప్రతినిధులకు అంగన్వాడీల సమ్మె నోటీసులు



ఎంపిపి కారం లక్ష్మికి సమ్మె నోటీసు ఇస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-విఆర్.పురం

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8న అంగన్వాడీ వర్కర్లు సమ్మె చేస్తున్న నేపథ్యంలో సమ్మె నోటీసులను ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన శుక్రవారం ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచులకు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ మండల కార్యదర్శి రాజేశ్వరి, జిల్లా సహాయ సభ్యులు సున్నం రంగమ్మ మాట్లాడుతూ, అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా ఇస్తామన్న వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీల సమ్మెకు గిరిజన సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఆ సంఘం నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడీ కార్యకర్తలు, మినీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సమ్మె కరపత్రాలు ఆవిష్కరణ

రాజవొమ్మంగి : ఈనెల 8 నుండి తలపెట్టే సమ్మెకు సంబంధించిన కరపత్రాలను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు కె వెంకటలక్ష్మి తదితరులు శుక్రవారం రాజవొమ్మంగిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ పనికి తగ్గిన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం డిమాండ్లు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమ్మెలో అంగన్వాడీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణి, రత్నం, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అంగన్వాడీలు


అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-కొయ్యూరు

మునుపెన్నడూ లేని విధంగా వైసిపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందని ఎంపిపి బడుగు రమేష్ అన్నారు. మండలంలోని రావణాపల్లి సచివాలయ పరిధిలో శుక్రవారం ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమేష్‌తో పాటు వైసిపి మండల అధ్యక్షులు జల్లి బాబులు, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జైతి రాజులమ్మ, జేసీఎస్ కన్వీనర్ బండి సుధాకర్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సచివాలయం పరిధిలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును డిస్ ప్లే చేసి, వైసీపీ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో నల్లగొండ సర్పంచ్ జంపా రాజకుమారి, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, వార్డు మెంబర్లు గొట్టిపల్లి లక్ష్మి, రాజేశ్వరి, రావణాపల్లి మాజీ వైస్ సర్పంచ్ జంపా రాంబాబు, నల్లగొండ మాజీ వైస్ సర్పంచ్ పల్లి చిన్నబ్బాయి, నాయకులు పాడి మల్లయ్య పాల్గొన్నారు.

మల్లవరంలో...

మండలంలోని చిట్టెంపాడు గ్రామ సచివాలయ పరిధి మల్లవరం గ్రామంలో పల్లెకు పోదాం, వై ఎపి జగన్ నీడ్స్ అనే కార్యక్రమాలు శుక్రవారం డౌనూరు ఎంపిటిసి బిడిజన అప్పారావు, ఎగ్జిక్యూటివ్ నెంబర్ నీలాపు సూరిబాబు ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పెట్ల గాంధీ, ఉల్లి రామ్మూర్తి, వాలంటీర్లు శివ, చంద్రరావు, నీలపు లక్ష్మీ, పండు, కె.మల్లేష్, సరస్వతి, గృహ సారథులు కె.నాగమణి, కె సీతాలి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు ఇస్తున్న ఎంపిపి రమేష్ తదితరులు

అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండల కేంద్రం లోని కొండవీధిలో గిరిజనేతరుడైన మహమ్మద్ శాశ్వత ఇల్లు నిర్మాణం నిలుపుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జి బుజ్జిబాబు, కె.జగన్నధం, కె.రామారావు శుక్రవారం మండల డిప్యూటి తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, కొండవీధిలో ఆదివాసీ గిరిజన సంఘం భవన్ ఎదురుగా గిరిజనేతరుడైన మహమ్మద్ అనుమతి లేకుండా శాశ్వత గృహ నిర్మాణం కోసం పునాదులు తవ్వుతున్నా రెవిన్యు, పంచాయితీ అధికారులు ఎందుకు నిలుపుదల చేయడం లేదని ప్రశ్నించారు. 1/70 చట్టం ప్రకారం గిరిజనేతరులు శాశ్వత గృహల నిర్మాణం చేయకూడదని, చట్టం చెపుతున్నా విరుద్ధంగా అక్రమ కట్టడాలు చేపడుతున్నారన్నారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో ప్రత్యేక చట్టాలు ఉన్నా వాటిని బేఖాతర్ చేస్తూ గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు జరుపుతున్నా స్థానిక అధికారులు చూస్తూ ఊరుకోవడం సరికాదన్నారు. గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయలవసిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో గిరిజనేతరులు ఇష్టారాజ్యాంగా అక్రమ కట్టడాలు నిర్మించుకుంటున్నారని విమర్శించారు. గిరిజనేతరుడు నిర్మిస్తున్న శాశ్వత గృహం నిలుపుదల చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

హుకుంపేట:మండల కేంద్రంలోని గిరిజనేతరులు చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై గిరిజన సంఘం నాయకులు రామారావు, క్రిష్ణారావు తహశీల్దార్ రాజ్యలక్ష్మికి శుక్రవారం పిర్యాదు చేశారు. గిరిజనేతరులు చేపట్టే నిర్మాణాలన్నీ అక్రమ నిర్మాణాలేనని, ప్రాథమికంగా వాటిని నిలువరించే అధికారం రెవెన్యూ అధికారులదే అన్నారు. సర్వహక్కులు కలిగిన గిరిజనుడు ఏదైనా నిర్మాణం చేపడితే విరుచుకు పడే అధికారులు దొడ్డి ప్రసాద్, బుడ్డెకు కొండమ్మలు చేపడుతున్న నిర్మాణాలపై ఎందుకు తాత్సారం చేస్తున్నారన్నారు.ఇప్పటికే గిరిజనేతరులు వందల సంఖలో అక్రమంగా ఇండ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ఇలానే వదిలేస్తే భవిష్యత్తులో ఆదివాసులకు ప్రభుత్వ భూమి సెంటు కూడా మిగలదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. గిరిజనేతరులు ఒక్కొక్కరు 10 నుంచి 12 ఇండ్లు, షాపులు నిర్మించుకున్నారన్నారు. లక్షల్లో అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసు కొంటున్నారని తెలిపారు. ఓటు బ్యాంక్ రాజకీయాలతో గిరిజన ప్రజాప్రతినిధులు చట్టాల్ని తాకట్టు పెడుతున్నారన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం త్వరలోనే ఈ విషయమై ఐక్య కార్యాచరణకు పిలుపు నిస్తుందని వారు తెలిపారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి -గాజువాక: వైసిపి సమన్వయకర్త, ఎపిఎస్ఎంఐడిసి ఛైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆండాలమ్మ కాలేజీలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేషస్పందన లభించింది. ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డితో కలిసి ఆనందకుమార్ జ్యోతిప్రజ్వళన చేసి జాబ్‌మేళా ప్రారంభించారు. 85 కంపెనీలు పాల్గొని సుమారు ఏడు వేలమంది నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, వారిలో 1256మందికి ఉద్యోగావకాశాలను కల్పించారు. ఆనందకుమార్ మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి, నిరుద్యోగ సమస్య పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ ఆశయాలకు అనుగుణంగా మిలీనియం శ్రీధర్‌రెడ్డితో చర్చించి ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు.స్కిల్ ట్రైనింగ్ అండ్ జాబ్ ఫెయిర్ ఎపి ప్రభుత్వ సలహాదారు గాది శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, శనివారంకూడా జాబ్‌మేళా కొనసాగుతుందని, మరిన్ని వివరాలకు 90008 18467, 90009 38467 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఎస్.ఎ.రెహమాన్ పాల్గొన్నారు.

స్థాయీ సంఘంలో 34 అంశాలు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయి సంఘం సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ ఛైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జివిఎంసి స్థాయి సంఘ సమావేశ మందిరంలో జరిగింది. ప్రధాన అజెండాలో 25 అంశాలు, టేబుల్ అజెండాలో 9 అంశాలు పొందుపరచగా అన్నీ ఆమోదించబడ్డాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.664.3 లక్షల అభివృద్ధి పనులకు, ప్రజా ఆరోగ్య విభాగానికి సంబంధించి పలు కార్యక్రమాలకు అదనపు కార్మికులను తాత్కాలిక సేవల నిమిత్తం ఉపయోగించుకున్నందుకు, ఇతర కార్యక్రమాల కోసం రూ.97.82 లక్షలు, యుసిడి విభాగానికి సంబంధించి ఎకో వైజాగ్ కార్యక్రమం, సామగ్రి సరఫరా కోసం రూ.3.88 లక్షలు వెచ్చించుటకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో స్థాయి సంఘ సభ్యులతో పాటు ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, యుసిడి పీడీ పాపునాయుడు, కార్యదర్శి పి.నల్లనయ్య పాల్గొన్నారు.

దిశ దివ్యాంగ్ సురక్ష ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలోనే మొదటిసారిగా దిశ దివ్యాంగ్ సురక్ష పేరిట సరికొత్త కార్యక్రమాన్ని విశాఖ నగరంలో ప్రవేశపెడుతున్నట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె ఆంధ్ర యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన దిశ దివ్యాంగ్ సురక్ష కార్యక్రమంలో వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పోలీస్ కమిషనర్ రవి శంకర్ అయ్యర్‌తో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ మాట్లాడారు. అంధులు, మూగ చెవిటివారితో పాటు ఇతర వికలాంగులూ ఈ దిశ దివ్యాంగ్ సురక్ష యాప్ ద్వారా సహాయం పొందవచ్చన్నారు. నగర పరిధిలో ఆపదలో ఉన్నట్లయితే 7337324466 నెంబరుకు ఫోన్ చేసినట్లయితే క్షణాలలో పోలీసులు వారిని రక్షించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. అనంతరం సురక్ష ప్రోగ్రామ్ సీడీని ఆవిష్కరించారు.

ఉత్సాహంగా విభిన్న ప్రతిభావంతుల టాలెంట్ షో

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఇంటర్నేషనల్ డిజబిలిటీ డేని పురస్కరించుకొని శుక్రవారం రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో విభిన్న ప్రతిభావంతుల టాలెంట్ షోను లయన్స్ క్లబ్ విశాఖపట్టణం, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించాయి. ఇది ఎంతో ఉత్సాహంగా సాగింది. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ ఎ.గోపాలరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల ఇదే ప్రాంగణంలో చిల్డ్రన్స్ డే జరిగిందని, ఇప్పుడు విభిన్న ప్రతిభావంతులకు ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ ప్రపంచంలో 13 కోట్ల మంది, మన దేశంలో 2.2 శాతం మంది వైకల్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. వారిని ప్రధాన స్రవంతిలోకి తీసుకొని రావడం కోసం ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిడెన్ స్ప్రౌట్స్, లెబెన్ షెల్ఫ్స్, సన్ ఫ్లవర్ స్కూల్, ధాన్ ఫౌండేషన్, ప్రజ్వల వాణి వెల్ఫేర్ సొసైటీ, పావని స్కూల్, పలు సంస్థల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. డ్రాయింగ్, పాటలు, ఫ్యాన్సీ డ్రెస్, డ్యాన్స్, ఉపన్యాసం, విచిత్ర వేషధారణ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. సృజనాత్మకతకు అద్దం పట్టేలా ప్రదర్శనలు జరిగాయి. ఇన్నర్ వీల్ క్లబ్‌కు నాయకులు విజయలక్ష్మి, రమా విద్యాసాగర్ సహకారం అందించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ పాస్ట్ గవర్నర్ ఎంవిఎన్ దుర్గాప్రసాద్, ప్రెసిడెంట్ లయన్ ఎం.ఎం.మహేష్, సెక్రటరీ వివిఎన్.నాయుడు, జివిఎస్‌వి.మాణిక్యాలరావు, డి. ప్రసాదు రాజు, ధాన్ ఫౌండేషన్ హెల్త్ కో ఆర్డినేటర్ కె.మురళీ కృష్ణారావు, హిడెన్ స్ప్రౌట్స్ శ్రీనివాసరావు, లెబెన్ షెల్ఫ్ వేణుగోపాల్ రెడ్డి, పిడబ్ల్యుఎస్ అలివేలు, మైథిలి సన్ ఫ్లవర్ స్కూల్, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ నుంచి ఎ. మణి, కల్యాణి, భవాని పాల్గొన్నారు.

నేడు విశాఖలో..

ఆర్ఎస్ బ్రదర్స్ ఫ్యామిలీ షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలోని పలు నగరాల్లో తన సేవలతో గుర్తింపు తెచ్చుకున్న ఆర్ఎస్ బ్రదర్స్ ఫ్యామిలీ షాపింగ్ మాల్ విశాఖపట్నంలోని జగదంబ సెంటర్‌లో శనివారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కానుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ నటుడు వరుణ్ తేజ్, విశిష్ట అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ తదితరులు హాజరుకానున్నారు.

బయో ఇన్ఫర్మేటిక్స్‌పై గీతంలో వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రముఖులు

ప్రజాశక్తి -మధురవాడ: నగరంలోని ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు బయోకెమిస్ట్రీ, బయోఇన్ఫర్మేటిక్స్ ప్రయోజనాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సైన్స్ బయోకెమిస్ట్రీ, బయోఇన్ఫర్మేటిక్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. డాక్టర్ జెసి.బోస్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ వర్క్‌షాప్‌ను గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎన్. కృష్ణ ప్రారంభించారు. పెటివా లిమిటెడ్ సంస్థ ప్రొడక్ట్ మేనేజర్ సౌమెన్‌డే విద్యార్థులకు ఔషధ తయారీ రంగంలో స్ట్రక్చరల్ బయోలజీ, డ్రగ్ డిజైనింగ్ వంటి అంశాలను వివరించారు. . గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి గీతంలో నిర్వహిస్తున్న సైన్స్ కోర్సులను వివరించారు. బయోకెమిస్ట్రీ, బయోఇన్ఫర్మేటిక్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ కె.విజయా రేఛల్ విద్యార్థులకు మాలిక్యులర్ బయాలజీ, మాలిక్యులర్ మోడలింగ్ అంశాలతోపాటు సైన్స్ పరిశోధనలలో మాస్ స్పెక్ట్రోస్కోపీ ఉపయోగాన్ని వివరించారు. నిర్వాహక కార్యదర్శి డాక్టర్ పి.వాసుదేవరాజు, ప్రొఫెసర్ మళ్ళ రామారావు, ప్రొఫెసర్ చల్లా సురేఖ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీలు



దుంబ్రిగుడలో ఎయిడ్స్‌పై అవగాహనకు మానవహారం

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీ, మండల కేంద్రం మూడు రోడ్ల జంక్షన్ వద్ద విద్యార్థులతో మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి పి.రాంబాబు మాట్లాడుతూ, ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిహెచ్‌ఓ సౌరి, హెల్త్ సూపర్వైజర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్స్ ఎస్.స్వామి, ప్రభాకర్, సంజీవ్ పాల్గొన్నారు.

రంపచోడవరం :ఏజెన్సీలో ఎయిడ్స్ పూర్తిస్థాయిలో నివారించే బాధ్యత ప్రతి వ్యక్తి పైనా ఉందని రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ నివారణపై వివిధ కళాశాలల విద్యార్థులతో స్థానిక ఐటిడీఏ కార్యాలయం నుండి నిర్వహించిన ర్యాలీని ప్రాజెక్ట్ అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకొనే వ్యాధని, ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏడిఎంహెచ్ఓ జి.ప్రకాశం, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి, వైద్యాధికారులు వినోద్, రాధిక, కీవిన్, గంగ సురేష్, ముఖర్జీ, ఎంపిహెచ్ఓ పీటర్, డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.భాస్కరరావు, లెనోవా కాలేజ్ ప్రిన్సిపాల్ జె.ప్రసాద్ పాల్గొన్నారు.

విఆర్.పురం : స్థానిక రేకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ఆర్ అండ్ బి రహదారిలో ఎయిడ్స్ మహమ్మారిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రేఖపల్లి ప్రధాన జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో రేఖపల్లి, జీడిగుప్ప పిహెచ్‌సిల వైద్యాధికారులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ సూర్యప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం, జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేశారు. నినాదాలతో ఉన్న ప్లకార్డులు చేతపట్టి చింతూరు ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం, వైస్ ప్రిన్సిపాల్ ఎమ్.శేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక పిహెచ్‌సి నుంచి వైద్యాధికారి సౌమ్య, సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులతో పోస్ట్ ఆఫీస్ నుండి మెయిన్ బజార్ వరకు ర్యాలీ చేసి, అక్కడ మనవహారం చేపట్టారు.సీఆర్పీఎఫ్ జి42 బెటాలియన్ డిఎస్పి సురేష్, స్థానిక ఎస్ఐ రామకృష్ణ, స్థానిక పిహెచ్సీ హెచ్ఎస్ త్రినాథ్, గ్రామ సర్పంచ్ దుర్జో, సిఆర్పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుందరం, కాంగ్రెస్ నాయకులు కారె శ్రీనివాస్ విద్యార్థులు, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమ బిందు ఆధ్వర్యాన ఆ గ్రామంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పిహెచ్సి సిబ్బంది ఎన్.రాణి, లోవ కుమారి పాల్గొన్నారు.







రంపచోడవరం, చింతూరు, సీలేరులో ఎయిడ్స్ నియంత్రణకు అవగాహన ర్యాలీలు, మానవహారాలు

రైతుల్లో తుపాను భయం

తడితోనే పొలాల్లో వరి కుప్పలు
ధాన్యం నాణ్యత పోతుందని ఆందోళన
కోత వాయిదా వేసుకోవాలని వ్యవసాయశాఖ సూచన

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

రైతులను తుపాను భయం వెంటాడుతోంది. భారీ వర్షాలు పడితే కోసిన వరి చేతికి రాకుండా పోతుందని వారు వాపోతున్నారు. కోసిన వరిచేనును వాతావరణ శాఖ హెచ్చరికతో తడితోనే అక్కడక్కడా పొలాల్లో కుప్పలు వేస్తున్నారు. ఎండకుండా కుప్పలు వేస్తే ధాన్యం ముక్కి చేను కుళ్లిపోతుంది. అందుకని కొంతమంది రైతులు తడితో కుప్పలు వేయడానికి భయపడుతున్నారు. బాగా పండిన చేను కోయకపోతే వరి వెన్ను రాలిపోతుందని మేఘాలు చూసుకొని కోస్తున్నారు. ఏదేమైనా ఈ ఏడాది రైతుకు వరి తీవ్రమైన బాధను మిగిల్చేలావుంది. వరి పంట వేయాల్సిన కాలంలో వర్షాలు ఎడపెట్టాయి. దీంతో జలాశయాల కింద పూర్తిస్థాయిలో వరి సాగుచేయలేని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని 24 మండలాల్లో 16 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. కొద్దిపాటి వర్షాలకు ఉడుపులు చేసిన తరువాత వర్షాలు ఎడపెట్టడంతో 15 వేల ఎకరాలకు పైగా పంట ఎండిపోయింది. అయినా కరువు మండలాలను ప్రభుత్వం ప్రకటించలేదు. బోర్లు, బావులు, జలాశయాల కింద సాగుచేసుకున్న వరి పంట చేతికొస్తున్న సమయంలో భారీ వర్షాలు రానుండడంతో ఈ పంటా ఇంటికొచ్చేలా లేదు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండగా మారి ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో పండిన వరి కోతలను రైతులు ఆపేశారు.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,36,460 ఎకరాల్లో వరి సాగు కావాల్సివుంది. 1,10,765 (81 శాతం) ఎకరాల్లో నమోదైంది. వరి కోతలు ముమ్మరమవుతున్న ఈ సమయంలో భారీ వర్షాలు కురవనుండడంతో రైతు కంట కునుకు కరువైంది. నిన్నటి వరకూ వర్షాల్లేక పంట వేయలేకపోయామని రైతులు బాధపడగా ఇప్పుడు వేసిన పంట చేతికి రాదన్న భయంతో వున్నారు. జిల్లాలోని దేవరాపల్లి, చీడికాడ, సబ్బవరం, కె.కోటపాడు, వి.మాడుగుల, ఇతర మండలాల్లో ఐదు వేల ఎకరాల వరి పంట రైతులు కోసినట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. అందులో కొంత వరకు వరి కుప్పలు వేశారు. అత్యధిక భాగం కుప్పలు వేయాల్సివుంది. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని రైతులను వ్యవసాయశాఖాధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఈ నెల నాలుగు నుంచి ఆరు వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని, వరి పంట కోయెద్దని సూచిస్తున్నారు. కోసిన వరి పొలాల్లోవుంటే కుప్పలు వేయడంగానీ, నూర్చడంగానీ చేయాలని అనకాపల్లి జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు సూచించారు. బాగా పక్వానికి వచ్చి గింజరాలే దశలో వున్న వరి పైరును మెషిన్‌తో కోసుకోవాలన్నారు. తక్షణమే పైరును త్రషర్ ద్వారా నూర్చుకొని మూడో తేదీలోపు ధాన్యాన్ని సురక్షితమైన ప్రదేశంలో నీడలో ఆరబెట్టుకొని జాగ్రత్త చేసుకోవాలన్నారు. నాలుగు నుంచి భారీ వర్ష సూచన ఉన్నందున ఆరు వరకు కోతను వాయిదా వేసుకోవాలన్నారు. చెరుకు గాలులకు పడిపోకుండా జడ చుట్లు వేసుకోవాలని ఆయన తెలిపారు.



దేవరాపల్లిలో వరి కుప్పలు వేస్తున్న రైతులు

30, 31 తేదీల్లో..

'ప్రపంచీకరణ-ఉపాధి'పై జాతీయ సదస్సు



మాట్లాడుతున్న కుమార్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కార్మికోద్యమ నిర్మాతల్లో ఒకరైన సిఐటియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక కార్యదర్శి నండూరి ప్రసాదరావు 22వ వర్ధంతి కార్యక్రమాల్లో భాగంగా 'ప్రపంచీకరణ - ఉపాధి' అన్న అంశంపై జాతీయ సదస్సును ఈ నెల 30, 31 తేదీల్లో విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తెలిపారు. శుక్రవారం జగదాంబ దరి సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ హాజరవుతారని వెల్లడించారు. నవంబరు 29 నండూరి ప్రసాదరావు వర్ధంతి రోజు నుంచి డిసెంబరు 29 వరకూ వివిధ పరిశ్రమల్లో సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటల పోటీలు నిర్వహించి 30, 31 తేదీల్లో జాతీయ సదస్సు తలపెట్టామన్నారు. దేశంలో 1990 నుంచి అమలు చేస్తున్న ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల వల్ల ప్రభుత్వ రంగం నిర్వీర్యమవుతోందని తెలిపారు. ఉపాధి తగ్గుతోందని, సామాజిక న్యాయం కొరవడుతోందని అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వెయ్యి రోజులకుపైగా ఉద్యమం కొనసాగుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను మోడీ సర్కారు తీసుకొచ్చిందని, ఫిక్స్‌డ్‌టెర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో ఉపాధికి రక్షణ లేకుండా చేస్తోందని అన్నారు. ఈ విధానాలపై చర్చించేందుకు ఈ జాతీయ సదస్సు దోహదపడుతుందని, దీనికి దేశవ్యాప్తంగా వివిధ రంగాలు, సంస్థల నుంచి 700 మంది కార్మిక ప్రతినిధులు హాజరౌతున్నారని తెలిపారు. అతిథులుగా ప్రభాత్ పట్నాయక్‌తో పాటు సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు కె.హేమలత, కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, పలువురు మేధావులు, అభ్యుదయవాదులు హాజరవుతారన్నారు. ఈ నేపథ్యంలో సదస్సు జయప్రదానికి ప్రజలు ఆర్థిక, హార్థిక సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, కార్యదర్శులు పి.మణి, బి.జగన్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గాయాలు

ప్రజాశక్తి-చింతపల్లి:మండల పరిషత్ కార్యాలయం సమీపంలో విద్యుత్ శాఖలో తాత్కాలికంగా పని చేస్తున్న వెంకటేష్ విద్యుత్ షాక్‌కి గురయ్యాడు. రెండు విద్యుత్ లైన్లు ఉండగా కింద ఉన్న విద్యుత్తు లైన్ ఆపి స్తంభం పైకెక్కిన అతనికి తల వెంట్రుకలకు పైనున్న హై టెన్షన్ వైర్ తగలడంతో షాక్కు గురై విద్యుత్ స్తంభంపై పడిపోయాడు. స్థానికులు చింతపల్లిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

సెక్రటరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి -అనంతగిరి:పింఛన్ సొమ్ముతో పాటు పంచాయితీ ఆదాయాన్ని స్వాహా చేసి పరారైన పంచాయితీ సెక్రెటరీ రవికుమార్ పై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు టోకురు పంచాయతీ సర్పంచ్ కిల్లో మొస్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ దారులకు ప్రతి నెల 1 తేదీన క్రమం తప్పకుండా పింఛను అందజేస్తుందన్నారు. పంచాయతీ సెక్రటరీ రవికుమార్ పింఛన్ సొమ్ము 7 లక్షలతో పాటు పంచాయతీ నిధులు సుమారు 3 లక్షల మొత్తం పది లక్షలు కాజేసి పరారయినట్లు తెలిపారు. స్థానిక ఎంపీడీవో దృష్టికి సమాచారం అందించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. పింఛన్ దారులకు సొమ్ము వెంటనే అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు ఎస్, నాగులు, జి.దేవన పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆర్ఎంపిల సేవలు అవసరం

ప్రజాశక్తి -ఆనందపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపిల సేవలు ఎంతో కీలకమనిఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి అన్నారు. శుక్రవారం మండలంలోని బుడగ జంగాల కాలనీలో ఆర్ఎంసిల ఆవశ్యకతపై ప్రజావేదికను నిర్వహించారు

ఐఎంఎ డాక్టర్ ఎస్ఎల్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో జోషి మాట్లాడుతూ, 60ఏళ్లకుపైగా గ్రామాలోల ఆర్ఎంపిలు వైద్యసేవలు అందిస్తున్నారని, వీరి సేవలను గుర్తిస్తూ ఇటీవల జిఒ 429ను ప్రభుత్వం జారీ చేసినా, దాని అమలులో పారదర్శకత లోపించిందన్నారు. నేడు ఆర్ఎంపిలను పట్టించుకునే నాధులే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మండల ఉపాధ్యక్షుడు మీసాల సత్యనారాయణ మాట్లాడుతూ, ఆర్ఎంపిలకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యానికి అర్హత కల్పించాలనానరు. కార్యక్రమంలో కొట్యాడ రెడ్డి బాబు, షినగం చిన్న రామారావు, కొట్యాడ సత్యమూర్తి బుడగ జంగాల నాయకుడు గౌరీ, ఆర్ఎంపి గౌరవాధ్యక్షులు మమ్ముల తిరుపతిరావు, జోనల్ కార్యదర్శి ఎన్. సుగుణేశ్వరి, స్థానిక అధ్యక్ష కార్యదర్శులు. పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి, కె.నారాయణ రావు,వినోద్, రఘు పాల్గొన్నారు.

విమ్స్‌ను క్యాంపు కార్యాలయం చేయొద్దు



నిరసన చేపడుతున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉత్తరాంధ్ర అభివృద్ధి, సమీక్ష పేరుతో విమ్స్ ఆసుపత్రిలో అధికారుల క్యాంపు కార్యాలయాలు, విడిది ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని సిపిఐ డిమాండ్ చేసింది. శుక్రవారం విమ్స్ ప్రధాన ద్వారం వద్ద సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేసారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న విమ్స్‌ను ప్రజోపయోగకరంగా అభివృద్ధి చేయాలన్న విజ్ఞప్తిని కాలరాసి, ఇప్పుడు అనాలోచిత నిర్ణయంతో విమ్స్‌ను నిర్వీర్యం చేయాలని చూడడం సరికాదన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.ఎస్.జె అచ్యుతరావు, ఎస్‌కె రెహ్మాన్, కె.సత్యాంజనేయ, ఎం.మన్మధరావు, ఆర్.శ్రీనివాసరావు, క్షేత్రపాల్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎండి బేగం, ఎ.దేముడమ్మ, పుష్పలత, నాగభూషణం. ఈశ్వర్రావు, కెలక్ష్మణరావు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎంపిపి రమేష్, అధికారులు

మృతురాలి కుటుంబానికి రూ.5 లక్షలు బీమా అందజేత

ప్రజాశక్తి -కొయ్యూరు : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో బూదరాళ్లకు చెందిన ఆశా కార్యకర్త కునిశెట్టి నాగమణి మృతి చెందగా, ఆమె కుటుంబానికి వైఎస్ఆర్ బీమా కింద రూ.5 లక్షలు మంజూరైంది. ఈ మేరకు రూ.5 లక్షల చెక్కును శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బడుగు రమేష్, ఎంపీడీవో లాలం సీతయ్య మృతురాలు నాగమణి భర్త చంద్రరావుకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి- విఆర్.పురం : మహిళా స్వయం సహాయక గ్రూపులను బలోపేతం చేయాలని వెలుగు ఎపిఎం జి.కిషోర్ అన్నారు. మండల కేంద్రం రేఖపల్లి వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్వాక్రా రుణాలను తమ స్వయం ఉపాధికి వాడుకొని మళ్లీ వాయిదాల రూపంలో ఆ మొత్తం చెల్లించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అన్ని సంఘాల్లో మహిళలు అభివృద్ధి చెందే దిశగా ప్రతి గ్రామ సమైక్య సంఘాలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వెలుగు సీసీలు, ఆయా గ్రామాల నుంచి హాజరైన డాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దని ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలోని 32వ వార్డు అల్లిపురం నేరెళ్ల కోనేరు రోడ్డులో జనావాసాలు, గుడి, బడిలకు దగ్గరగా మద్యం దుకాణం పెట్టకూడదని స్థానిక ప్రజలు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఇప్పటికే ఈ ఏరియాలో రెండు దుకాణాలు ఉన్నాయని, ఇప్పుడు మూడోది పెట్టి ఈ ప్రాంత ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదని నినాదాలు చేశారు. జనసేన నాయకులు తెలుగు అర్జున్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మద్దతుగా పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని ప్రజాదర్బార్ కార్యక్రమంలో గతంలోనే ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కు స్థానికులు వినతిపత్రం సమర్పించారన్నారు. దీనికి స్పందించిన ఆయన అక్కడ మద్యం షాపును ఏర్పాటు చేయడం లేదని చెప్పారన్నారు. అయితే ఆ మాటకు భిన్నంగా మద్యం షాపును ఏర్పాటు చేస్తున్నారని, దీనికి ఎమ్మెల్యే మద్దతు ఉందన్న అనుమానం తమకు ఉందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రామిరెడ్డి, ఆ పార్టీ వార్డు మహిళా అధ్యక్షురాలు వాసుపల్లి బంగారమ్మ, వార్డు టిడిపి కార్యదర్శి దాసరి సత్యనారాయణ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో రిజర్వేషన్లకు భంగం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం వల్ల రిజర్వేషన్లు లేకుండా పోతాయని, అదే జరిగితే దళితులకు, గిరిజనులకు, మహిళలకు, బిసిలకు ఉపాధి లేకుండా పోతుందని సిఎఫ్‌టియుఐకు చెందిన సంప్రదాయ మత్స్యకారుల యూనియన్ జిల్లా నాయకురాలు కె.లక్ష్మి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి 973వ రోజుకు చేరాయి. దీక్షల్లో సంప్రదాయ మత్స్యకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో లక్షలాది మందికి ఉపాధి లభించడంతోపాటు రిజర్వేషన్లు అమలులో ఉంటాయన్నారు. విశాఖ నగర అభివృద్ధిలో కీలక పాత్ర స్టీల్ ప్లాంట్‌దేనని గుర్తుచేశారు. అటువంటి పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే అంగీకరించేది లేదని చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకు ఆందోళనను ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మి, జి.లక్ష్మి, రమ్య, కిషోర్, జి.కొండ, ఎం.దుర్గాలమ్మ, జి.నానమ్మ పాల్గొన్నారు.